గ్యాస్ ప్రాజెక్టుల ప్రారంభం..

సంతోషదాయకం



గ్యాస్‌తో నడిచే వాహనాల తాళాన్ని కమిషనరు మౌర్యకు అందజేస్తున్న సీఎం చంద్రబాబు

- తిరుచానూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు
- గ్యాస్‌తో నడిచే వాహనాలు కార్పొరేషన్‌కు అప్పగింత

తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి సీఎన్‌జీ, పీఎన్‌జీ ప్రాజెక్టులను ప్రారంభించడం సంతోషంగా ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. దేశంలోనే అతిపెద్ద సహజవాయు ఉత్పత్తి సంస్థల్లో ఒక్కటైన ఏజీ అండ్ పీ - ప్రథమ్ థింక్ గ్యాస్ సంస్థ తిరుపతిలోని తాజ్ హోటల్‌లో ఆదివారం సాయంత్రం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏజీ అండ్ పీ కంపెనీ ఏర్పాటు చేసిన సీఎన్‌జీతో నడిచే వివిధ రకాల వాహనాల ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. తిరుపతి కార్పొరేషన్ పరిధిలో చెత్త సేకరణ కోసం గ్యాస్‌తో నడిచే వాణిజ్య వాహనాలను మున్సిపల్ కమిషనర్ మౌర్యకు అప్పగించారు. ఆ తర్వాత కార్యక్రమ నిర్వాహక సంస్థ రేణిగుంట మండలం గాజులమండ్యంలో ఏర్పాటు చేసిన సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్కును.. సీఎన్‌జీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌నూ ఆయన ప్రారంభించారు. ఇక్కడి నుంచే చిత్తూరులో ఏజీ అండ్ పీ ప్రథమ్ థింక్ గ్యాస్ సీఎన్‌జీ మదర్ స్టేషన్‌ను ప్రారంభించి, నెల్లూరులో ఎస్‌సీఎన్‌జీ స్టేషన్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ.. నెల్లూరు, రాయలసీమ జిల్లాల్లో ఏజీ అండ్ పీ కంపెనీ రానున్న ఐదేళ్లలో రూ.10 వేల కోట్ల పెట్టుబడితో పది వేల మందికి ఉపాధి అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ఈ సంస్థకు తమ ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఏజీ అండ్ పీ సంస్థ ఎండీ, సీఈవో అభిలేష్ గుప్తా, మంత్రులు బి.సి.జనార్దన్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నానీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, గాలి భానుప్రకాష్, డాక్టర్ థామస్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ తదితరులతో పాటు పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.



లీలావతి ఇంట్లో టీ కాచి వడకడుతున్న సీఎం చంద్రబాబు

ఏమ్మా.. టీ ఎలా ఉంది?
కప్పు చేతికందించి సీఎం చంద్రబాబు వేసిన ప్రశ్న

సర్, మా ఇంట్లో మీరే టీ పెట్టి మాకివ్వడం మహాభాగ్యం.
ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతూ లీలావతి ఇచ్చిన సమాధానమిది.

తిరుచానూరులో శరవణ, లీలావతి దంపతుల ఇంటికి అమర్చిన ఏజీ అండ్ పీ అనే సంస్థకు చెందిన డొమెస్టిక్ పైపులైన్ నేచరల్ గ్యాస్ సరఫరాను సీఎం చంద్రబాబు ఆదివారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం ఆయన లబ్ధిదారు ఇంట్లో గ్యాస్ స్టవ్ వెలిగించి టీ పెట్టారు. ఆ దంపతులకు టీ అందజేసి తానూ తాగారు. ఏమ్మా..! టీ బాగుందా.. అంటూ సరదాగా అడిగారు. చాలా చక్కగా ఉందంటూ ఆనందం వ్యక్తంచేశారు. పైపులైన్ సరఫరా వల్ల గ్యాస్ అయిపోయిందనే సమస్య లేదని వాళ్లు సీఎంతో అన్నారు. మీటరులో రీడింగ్ మేరకు వాడిన గ్యాస్‌కు ప్రతినెలా కట్టాల్సి ఉంటుందన్నారు. మాటల మధ్యలో సీఎం చంద్రబాబు శరవణ కుటుంబ స్థితిగతులను ఆరా తీశారు. 'నేను కార్పెంట్ వర్క్ చేస్తాను. గతంలో ఆవులు ఉండటంతో కుటుంబ పోషణ జరిగేది. అవి చనిపోయాయి' అని వారు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. 'శరవణా.. లీలావతి, మీరు భయపడవద్దు, పీఎంఏవై కింద రూ.3లక్షలతో పాటు, సీఎం రిలీఫ్ ఫండ్ రూ.లక్షతో కలిపి మొత్తం రూ.4లక్షలు ఇంటికి ఇస్తాం' అని అన్నారు. ఆవుల కోసం మరో రూ.2లక్షలు తక్షణ సాయం కింద అందించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను ఆదేశించారు. దాదాపు 15 నిమిషాల పాటు శరవణ కుటుంబ సభ్యులతో సీఎం చంద్రబాబు గడిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ నేతలు నరసింహయాదవ్, అమిలినేని మధు, శ్రీధర్‌వర్మ, ఈశ్వరరెడ్డి, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సాయి రాయల్, హరేరామ్, వాసు, కత్తి సుధ తదితరులు పాల్గొన్నారు.



శరవణ దంపతులకు ఇంటి మంజూరు పత్రాలు అందజేస్తున్న సీఎం

ఒకరోజు ముందే సంక్రాంతి వచ్చింది

రూ.ఆరు లక్షలకు మంజూరు పత్రాలను సీఎం చంద్రబాబు అందించడంతో శరవణ, లీలావతి దంపతులు ఆనందం వ్యక్తంచేశారు. 'మాలాంటి పేదల ఇంటికి ముఖ్యమంత్రి చంద్రబాబు సార్ రావడం.. ఆయన దగ్గర ఉండి మాకు టీ కాచి ఇవ్వడం.. మేము అడగకుండానే మా ఆర్థిక స్థితిగతులు తెలుసుకుని వరాల జల్లు కురిపించడం.. మా ఇంట్లో కూర్చుని 15నిమిషాలకుపైగా మాట్లాడటం.. మా జీవితంలో మరచిపోలేం. ఆయనకు మేము రుణపడి ఉంటాం. మా ఎమ్మెల్యే పులివర్తి నానికి కృతజ్ఞతలు. మాకు ఒకరోజు ముందే సంక్రాంతి వచ్చింది' అని శరవణ, లీలావతి దంపతులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి



శిల్పారామం వద్ద భోగి మంట

భోగి భాగ్యములివ్వ

సంక్రాంతికి స్వాగతం పలుకుతూ తిరుచానూరురోడ్డులో శిల్పారామంలో ఆదివారం రాత్రి ముందస్తు భోగిమంటలు వేశారు. సందర్శకులు కేరింతల మధ్య భోగిమంటలు వేశారు. పలుచోట్ల అర్ధరాత్రి 12 గంటలకే భోగి మంటలు వేసి భోగి భోగి అంటూ సందడి చేశారు. ఇక, శిల్పారామంలో ఆదివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, జబర్దస్త్ కళాకారుల కామెడీ స్కిట్లు ఉంటాయని ఏవో ఖాదరవల్లీ తెలిపారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

శ్రీవారి పరకామణిలో బంగారు బిస్కెట్ చోరీ





పెంచలయ్య

- కాంట్రాక్ట్ ఉద్యోగి అరెస్ట్

తిరుమల, జనవరి13(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ కానుకలు లెక్కించే పరకామణి భవనంలో ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి ఏకంగా బంగారు బిస్కెట్‌ను దొంగిలించి పట్టుబడ్డారు.ఖాళీ ట్రాలీ నుంచి బయటకు పంపి ఆ తర్వాత తీసుకోవాలనే అతని ప్లాన్‌ను విజిలెన్స్ శాఖ బయటపెట్టింది. సాధారణంగా కానుకలతో నిండిన హుండీలను సీల్ వేసి ఆలయం వెలుపల ఉన్న పరకామణి భవనానికి పంపుతారు. హుండీలో వచ్చిన కానుకలను అక్కడ వేరు చేసి లెక్కిస్తారు. టీటీడీ ఉద్యోగులు, పరకామణి సేవకులు, అబ్రిపోస్ సంస్థ ద్వారా మరికొంతమంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఈ పనులు చేస్తారు.వీరిలో అబ్రిపోస్ నుంచి పెంచలయ్య అనే కాంట్రాక్ట్ ఉద్యోగి పరకామణిలో శనివారం విధులకు హాజరయ్యాడు. కొన్ని వస్తువులతో కూడిన ట్రేతో గ్రౌండ్ ఫ్లోర్ నుంచి ఫస్ట్ ఫ్లోర్‌కు చేరుకుని గోల్డ్ రూమ్‌లోకి వెళ్లాడు. ప్లాస్టిక్ ట్రేలలో నిల్వచేసిన బంగారు వస్తువుల దగ్గరకు వెళ్లి 100 గ్రాముల బరువున్న గోల్డ్ బిస్కెట్‌ను మలవిసర్జన ద్వారం వద్ద దాచి కింది ఫ్లోర్‌కు చేరుకున్నాడు. అక్కడ దారంతో బంగారు బిస్కెట్‌ను చుట్టి 17వ నెంబరు ఖాళీ ట్రేలోని పైప్ రంధ్రంలో దాచి చెకింగ్ ప్రాంతానికి పంపేశాడు.పరకామణి భవనంలో పటిష్ఠమైన సీసీ కెమెరాల వ్యవస్థ ఉండటంతో ఈ వ్యవహారం మొత్తాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించి పెంచలయ్యను అదుపులోకి తీసుకుని తిరుమల వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

నారావారిపల్లెకు

నారా, నందమూరి కుటుంబాలు



నారావారిపల్లెలో వినతిపత్రాలు తీసుకుంటున్న సీఎం చంద్రబాబు

చంద్రగిరి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు నారావారిపల్లెకు నారా, నందమూరి కుటుంబాలు చేరుకున్నాయి. ఆదివారం సాయంత్రం సీఎం చంద్రబాబు చంద్రబాబు స్వగ్రామానికి వచ్చారు. ఎమ్మెల్యే నానీతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు స్వాగతం పలికారు. అప్పటికే వేచి ఉన్న జనం సమస్యలు విని, వినతిపత్రాలు స్వీకరించారు. ఉదయం 11.30 గంటల సమయంలో మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి, కుమారుడు నారా దేవాన్ష్ వచ్చారు. వీరికి ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాలర్స్ దివాకర్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి హేమేంబరధర రావు, స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఇక, నారా భువనేశ్వరి, నారా ఇందిర, ఇతర బంధువులు శనివారమే నారావారిపల్లెకు వచ్చారు. సాయంత్రం 5.30 గంటలకు తమ కుటుంబీకులతో పాటు నందమూరి రామకృష్ణ తదితరులతో కలిసి శేషాచలం లింగేశ్వరస్వామిని మంత్రి లోకేశ్ దర్శించుకున్నారు. అనంతరం కందులవారిపల్లెలో వినాయకస్వామిని దర్శించుకున్నారు. అదే గ్రామంలోని తన మేనత్త అయిన కనుమూరి హైమావతి ఇంటికి వెళ్లి 10 నిమిషాలు ఉన్నారు.

నేడు సీఎంచే పలు శంకుస్థాపనలు

నారావారిపల్లెలో పలు అభివృద్ధి పనులకు సోమవారం సీఎం చంద్రబాబు శంకుస్థాపనలు చేయనున్నారు. నారావారిపల్లి పరిధిలో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన.. రూ.5 కోట్లతో ఇండోర్ విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు భూమి పూజ.. రంగంపేట జడ్పీ హైస్కూలును శ్రీసిటీ సెజ్ దత్తత తీసుకునే కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తారు. గ్రామంలో నిరుద్యోగ యువతకు సెర్ప్ ద్వారా అందించిన 15 ఇ-ఆటోలను ప్రారంభించనున్నారు. 2 వేల ఇళ్లకు రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్ ఏర్పాటు చేయడం ద్వారా సౌర విద్యుత్ ప్రాజెక్టు ప్రారంభిస్తారు. ఇప్పటికే 20 ఇళ్లకు సోలార్ ప్యానెళ్ళు ఏర్పాటు చేయగా వాటిని చంద్రబాబు నేడు ప్రారంభిస్తారు. అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లల మానసిక సామర్థ్యాలను పెంపొందించే దిశగా కేర్ అండ్ గ్రో అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకోనున్నారు. ఈజీమార్ట్ అనే సంస్థతో నారావారిపల్లి పరిధిలోని చిన్న దుకాణాలకు అవసరమైన సరుకులు, వస్తువులను సరఫరా చేసే గూడ్స్ చెయిన్‌కు ఒప్పందం కుదుర్చుకోనున్నారు. వీటితో పాటు పలు రుణ పథకాలను కూడా మంజూరు చేసే అవకాశముంది. ఈ కార్యక్రమాలతో సీఎం చంద్రబాబు సోమవారం స్వగ్రామంలో బిజీబిజీగా గడపనున్నారు.

శేషాచల లింగేశ్వరస్వామి ఆలయంలో మంత్రి నారా లోకేశ్, భువనేశ్వరి తదితరులు



నారావారిపల్లెలో భారీ బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 12(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నారావారిపల్లెలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం నుంచి 15వ తేది వరకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, కుటుంబ సభ్యులు స్వగ్రామంలో గడపనున్నారు. దీంతో పోలీసులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. ఇప్పటికే భారీ ఎత్తున బలగాలు నారావారిపల్లికు చేరుకున్నాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ, ఇతర శాఖల అధికారులు, సెక్యూరిటీ అధికారులు నారావారిపల్లిలో వున్నారు. సీఎం కోసం దాదాపు 700 మంది పోలీసులను నియమించారు. వీరు కాకుండా ఎస్టీఎఫ్ సిబ్బంది, డాగ్, బాంబు స్క్వాడ్‌లు అడుగడుగునా తనిఖీలు చేస్తున్నాయి. సీఎం ఇంటిలోకి ఎవ్వరినీ అనుమతించడం లేదు. అటు జిల్లా యంత్రాంగం ఇటు సీఎం కుటుంబ సభ్యులు, బంధువుల రాకతో నారావారిపల్లిలో సంక్రాంతి సందడి నెలకొంది.

టీటీడీ ఇన్‌చార్జి సీవీఎస్వోగా మణికంఠ

ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జి కూడా..



తిరుపతి(నేరవిభాగం), జనవరి 12(ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలును తిరుపతి జిల్లాలో మూడు ప్రధాన విభాగాలకు ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమించింది. ఇప్పటికే ఆయన తిరుపతి జిల్లా ఇన్‌చార్జి ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా టీటీడీ ఇన్‌చార్జి సీవీఎస్వోగా.. ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జిగానూ నియమించింది. ఈ మేరకు ఇన్‌చార్జి సీవీఎస్వోగా ఆయన ఆదివారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విజిలెన్సు అధికారులను పరిచయం చేసుకున్నారు. అంతకు మునుపు టీటీడీ సెక్యూరిటీ అధికారులు, విజిలెన్సు అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. తిరుమలలో భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యలపై కాసేపు అధికారులతో చర్చించారు.



మిస్ గ్లోబల్ ఏసియా విజేత భావనరెడ్డి

చంద్రగిరి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మిస్ గ్లోబల్ ఏసియా-2025 విజేతగా భావనరెడ్డి చిన్నతంబు నిలిచారు. ఈనెల 9వ తేదీన మలేషియాలో నిర్వాన్ సిమ్ అండ్ లియే రేనాల్డ్ ఆధ్వర్యంలో అందాల పోటీలు నిర్వహించారు. ఈపోటీలలో 40 దేశాల నుంచి యువతులు పాల్గొన్నారు. ఇందులో చంద్రగిరికి చెందిన భావన రెడ్డి చిన్నతంబు (ఇండియా) విజేతగా నిలిచారు. ఈమె చంద్రగిరికి చెందిన రియల్టర్ సి.గోపికృష్ణ, లక్ష్మి దంపతుల కుమార్తె. మిస్ గ్లోబల్ ఏసియా విజేతగా నిలిచిన ఈమె ఆదివారం సాయంత్రం స్వగ్రామమైన చంద్రగిరికి చేరుకోగా చేరుకోగా.. ఘన స్వాగతం లభించింది. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ కేక్ కట్ చేసి అమెకు తినిపించారు. ఈకార్యక్రమంలో టీడీపీ నేత పులికంటి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న భావనరెడ్డి చిన్నతంబు



మారుతీ శివకుమార్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

- మృతుల్లో ఒకరు తిరుపతి టౌన్‌బ్యాంకు జీఎం
- మరొకరికి తీవ్రగాయాలు

మదనపల్లె అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొనడంతో ప్రకాశ్ (55), మారుతీ శివకుమార్ (61) మృతి చెందగా ఆనంద్ అనే వ్యక్తి గాయపడ్డారు. ఈ ప్రమాదంపై పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తిరుపతి కట్టకిందపాలెంకు చెందిన ప్రకాశ్.. తిరుపతి టౌన్ బ్యాంక్ జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. తిరుపతికే చెందిన తన స్నేహితుడు ఆనంద్‌తో కలిసి శనివారం ఆయన బెంగళూరు వెళ్లారు. పని ముగించుకుని ఆదివారం తిరిగి తిరుపతికి వస్తుండగా కర్ణాటక రాష్ట్రం రాయల్పాడు వద్దకు రాగానే కడప నుంచి మారుతీ శివకుమార్ అనే వ్యక్తి వెళుతున్న కారును ఆదివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో వీరి కారు ఢీకొంది. ప్రమాదంలో ప్రకాశ్ సంఘటనా స్థలంలోనే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ ఆనంద్‌ను చెన్నైకి తరలించారు. కడపకు చెందిన మారుతీ శివకుమార్‌ను మదనపల్లె ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు రాయల్పాడు పోలీసులు కేసు నమోదు చేశారు.



ప్రకాశ్

టీటీడీ ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానం

- అనుమతించిన ప్రభుత్వం

తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గతేడాది శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని టీటీడీ ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానం పంపిణీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. గతేడాది నవంబరు 27న టీటీడీ ఈవో పంపిన ప్రతిపాదనకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆమోద ముద్ర వేసింది. టీటీడీలో రెగ్యులర్ ఉద్యోగులు, డెప్యుటేషన్‌పై పని చేస్తున్న వారికి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉద్యోగులకు, టైమ్ స్కేల్ ఉద్యోగులకు, కన్సాలిడేటెడ్ పే ఉద్యోగులకు రూ. 15,400 చొప్పున అలాగే ఇతర కేటగిరీ ఉద్యోగులకు రూ.7535 చొప్పున బ్రహ్మోత్సవ బహుమానం అందించేందుకు అనుమతినిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

వచ్చినవారికి వచ్చినట్లుగా..!

- సాఫీగా వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ

తిరుపతి (అర్బన్/జీవకోన/వైద్యం), జనవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, భూదేవి కాంప్లెక్సుల్లో ఆదివారం తిరుమల వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. వచ్చినవారు వచ్చినట్లుగా టోకెన్లు తీసుకున్నారు. ఎక్కడా ఎలాంటి హడావిడి లేదు. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి టోకెన్లు గత 9వ తేదీన జారీచేసిన విషయం తెలిసిందే. మిగిలిన ఏడు రోజులకు సంబంధించిన టోకెన్ల జారీ ప్రక్రియను శనివారం రాత్రి 9.30 గంటలకు ప్రారంభించారు. రద్దీ తక్కువగా ఉందని ముందుగానే గ్రహించిన టీటీడీ.. మూడు కేంద్రాలను మాత్రమే ఎంపిక చేశారు. మొదట్లో క్యూలైను ఏర్పడినా, ఎలాంటి తోపులాటలు, భక్తుల మధ్య ఒత్తిళ్లు చోటుచేసుకోలేదు. ఆ తర్వాత క్యూలైను డైరెక్టు అయ్యింది. క్యూలోని భక్తులకోసం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం టీటీడీ అన్నప్రసాదాలను పంపిణీ చేసింది. రద్దీ తక్కువగా ఉన్న పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, సోమవారానికి (13వ తేది) సంబంధించి తొలుత 48వేల టోకెన్లు మంజూరు చేయగా, ఆ తర్వాత అదనంగా మరో పది వేలు కేటాయించారు. ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు 58వేల టోకెన్ల జారీ పూర్తయింది. ఆ తర్వాత 14వ తేదీ దర్శనానికి టోకెన్ల జారీ ప్రారంభించారు. మంగళవారం కూడా దాదాపు 60వేల టోకెన్లను కేటాయించారు. కాగా, కంటిన్యూగా 19వ తేది వరకు దర్శన టోకెన్లను జారీ చేయనున్నారు.




అనుపల్లిలో జల్లికట్టుకు ఏర్పాట్లు

అనుపల్లిలో జల్లికట్టుకు భారీ ఏర్పాట్లు

రామచంద్రాపురం,జనవరి12(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా మండలంలోని అనుపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించే జల్లికట్టుకు భారీ ఏర్పాట్లు చేశారు. సిమెంటు రోడ్లపై పశువులకు ఎలాంటి గాయాలూ కాకుండా ఎర్రమట్టి పోశారు. సందర్శకుల భద్రత కోసం తడికెలు, బారికేడ్లు కట్టారు. చలువపందిళ్లు వేశారు. తమిళనాడుతో పాటు ఉభయ జిల్లాల నుంచి జల్లికట్టును తిలకించేందుకు భారీగా జనం తరలివస్తారు. సందర్శకుల కోసం తాగునీరు, భోజన వసతి ఏర్పాటు చేస్తున్నారు.

సంక్రాంతి క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న హర్షిత్‌రెడ్డి

తిరుపతిరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట కేవీఎస్ స్పోర్ట్స్ పార్క్ వేదికగా నిర్వహిస్తున్న రెండు రోజుల సంక్రాంతి క్రికెట్ పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు హర్షిత్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకోగా.. గ్రామానికి చెందిన నల్లందుల సుధాకర్‌రెడ్డి టాస్‌వేసి పోటీలను ప్రారంభించారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన యువత పాల్గొన్నారు. తొలిరోజు పోటీలు హోరాహోరీగా సాగాయి.


ఇందుశేఖర్ : టీడీపీ నేత కొల్లూరి ఇందుశేఖర్ ఆదివారం తిరుపతి విమానాశ్రయంలో మంత్రి నారా లోకేష్‌ను కలిశారు. ఆయనకు స్వాగతం పలికి, పండుగ శుభాకాంక్షలు తెలిపారు


తిరుపతి విమానాశ్రయంలో మంత్రి నారా లోకేష్‌ను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమ్మణ్యం కలిశారు. సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పారు. తిరుపతిలో పార్టీ అభివృద్ధికి పనిచేయాలని లోకేశ్ సూచించినట్లు చెప్పారు.

- తిరుపతి(నేరవిభాగం)


తిరుపతి విమానాశ్రయంలో సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న టీటీడీ చైర్మన్ బీఆర్‌నాయుడు


తిరుపతి విమానాశ్రయంలో సీఎం చంద్రబాబుకు ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ స్వాగతం



సంప్రదాయానికి ప్రతీక సంక్రాంతి

తిరుపతి(ఆటోనగర్) జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సంబంధాలు, సంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అన్నారు. రాష్ట్రీయ సేవా సమితి(రాస్) ప్రధాన కార్యాలయంలో ఆదివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంబరాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సంప్రదాయాలను మరచిపోతున్న ప్రస్తుత తరుణంలో రాస్ నిర్వాహకులు గుర్తు చేస్తుండడం అభినందనీయమన్నారు. రంగవల్లులు, భోగి మంటలు, గొబ్బెమ్మలు, కోలాటాలు, గంగిరెద్దులాటలు, హరిదాసు కీర్తనలు, జంగందేవర పాటలు, బుడబుక్కల వారి ఆసక్తికర మాటలు, గాలిపటాలు, బతుకమ్మపాటలతో కార్యాలయలో సంక్రాంతి సందడి నెలకొంది. రాస్ ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం నాయుడు చేతుల మీదుగా దివ్యాంగులకు వీల్‌ఛైర్‌లు, సపోర్టింగ్ వాకర్స్, దుప్పట్లు పంపిణీ చేశారు. సంయుక్త కార్యదర్శి మమత, మహిళా వికాస్ ప్రెసిడెంట్ సమత, డైరెక్టర్ వి.నాగరాజు, కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు పాల్గొన్నారు.

రెండు దశాబ్దాల తర్వాత..!

ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో 2001-04 బ్యాచ్ విద్యార్థుల సమావేశం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి12 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాల క్రితం డిగ్రీ చదువుకొని వివిధ రంగాల్లో జీవనయానం సాగిస్తున్న వీరంతా మరోసారి చదువుకున్న తావునే కలిశారు. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో 2001-04 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆ కాలేజీలో సమావేశమయ్యారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పరస్పర క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. కాలేజీ, విద్యార్థుల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని నిర్ణయించారు. ఇకపై తరచూ సమావేశం కావాలని తీర్మానించారు. నాటి అధ్యాపకులను సన్మానించారు. పూర్వ విద్యార్థులు దేశ, విదేశాల నుంచీ ఈ సమావేశానికి హాజరుకావడం పట్ల ప్రిన్సిపాల్ వేణుగోపాలరెడ్డి, కామర్స్ హెడ్ మల్లికార్జునరావు, పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షులు అజ్మల్‌బాషా, అధ్యాపకుడు వెంకటరత్నం హర్షం వ్యక్తం చేశారు.

డాకూ మహారాజ్ సినిమా చూసిన మంత్రి లోకేశ్



చంద్రగిరి, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : చంద్రగిరిలోని ఎస్వీ సినిమా థియేటర్‌లో మంత్రి నారా లోకేశ్ నందమూరి బాలకృష్ణ హీరోగా నటించిన డాకూ మహారాజ్ సినిమాను ఆదివారం రాత్రి వీక్షించారు. నారా బ్రాహ్మణి, నందమూరి రామకృష్ణ, నారా ఇందిర, ఎంపీ భరత్, తేజస్విని, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి థియేటర్‌కు వచ్చిన లోకేశ్‌కు స్థానిక టీడీపీ నాయకులు స్వాగతం పలికారు. అందరూ కలిసి సినిమాను వీక్షించారు.

నారావారిపల్లిలో నేడు విద్యుత్ సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన

తిరుపతి(ఆటోనగర్), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నారావారిపల్లిలో రూ.4.50 కోట్లతో 33/11 కేవీ మినీ ఇండోర్ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైంది. దీనికి సీఎం చంద్రబాబు సోమవారం భూమిపూజ చేయనున్నట్లు నిర్మాణాల విభాగం ఈఈ పి.బాలాజీ తెలిపారు. సీఎం చేతుల మీదుగా శంకుస్థాపన చేయించడానికి విద్యుత్ శాఖ తిరుపతి సర్కిల్ ఎస్ఈ సురేంద్ర నాయుడు అధ్వర్యంలో పనులు చేపట్టారు. సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయడం ద్వారా నారావారిపల్లి పరిసర ప్రాంతాల్లో లోటల్టేజ్ సమస్యను పరిష్కరించవచ్చునని ఈఈ తెలిపారు.





సంక్రాంతి సందడి

రోడ్లు, దుకాణాల్లో విపరీతమైన రద్దీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా తిరుపతిలోని దుకాణాలు జనంతో కిక్కిరిసిపోయాయి. దుస్తులు, కిరాణా షాపులు, పూలు, పండ్లు, కూరగాయలు, నాటు కోళ్ళు, ముగ్గుల రంగుల దుకాణాల వద్ద ఆదివారం విపరీతమైన రద్దీ కన్పించింది. గాంధీ రోడ్డులో ఉదయం నుంచీ రాత్రి దాకా విపరీతమైన రద్దీ కొనసాగింది. ట్రాఫిక్ పోలీసులు ఎప్పటికప్పుడు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

జాతీయ యువజనోత్సవాల ప్రత్యేక అతిథిగా రవినాయుడు


కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, ఎంపీ హరీష్‌తో రవినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని భారత్ భవన్ వేదికగా నిర్వహించిన జాతీయ యువజనోత్సవాల ప్రత్యేక అతిథిగా శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు హాజరయ్యారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్ నేతృత్వంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో చేపడుతున్న క్రీడాభివృద్ధిని వారికి వివరించారు. అలాగే రాష్ట్రానికి చెందిన 68 మంది కళాకారులు వివిధ సంగీత, నృత్య ప్రతిభా పోటీల్లో పాల్గొన్నారు. ఇందులో తిరుపతిలోని పలు యూనివర్సిటీలు, కాలేజీల విద్యార్థులు ఉన్నారు. జాతీయ యువజనోత్సవాల్లో విజేతలుగా నిలిచి రాష్ట్ర ఖ్యాతిని మరింతగా ఇనుమడింప చేయాలని రవినాయుడు ఆకాంక్షించారు.

లాన్‌టెన్నిస్ విజేతలు నగరవాసులు


ట్రోఫీ అందుకుంటున్న విన్నర్స్, రన్నర్స్

తిరుపతి(క్రీడలు), జనవరి 12(ఆంధ్రజ్యోతి): క్రీడాభారతి అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక టౌన్, ఆఫీసర్ క్లబ్‌లలో మూడు రోజులుగా జరిగిన ఎస్.నాగముని మెమోరియల్ లాన్‌టెన్నిస్ టోర్నమెంటు ఆదివారం ముగిసింది. లీగ్ దశ, క్వార్టర్స్, సెమీఫైనల్స్‌లో నిష్క్రమించిన క్రీడాకారులు బహుమతులు అందుకుని ఎప్పటికప్పుడు తమ ఊర్లకు పయనమయ్యారు. తుది సమరంలో 70 ఏళ్ల పైబడిన డాక్టర్ చంద్రశేఖర్(శ్రీకాళహస్తి), అశోక్‌రెడ్డి(కడప)లపై తిరుపతికి చెందిన పి.విజయకుమార్‌రెడ్డి, ప్రొఫెసర్ అబ్దుల్‌సత్తర్‌లు విజయం సాధించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంస్కృత విద్యాపీఠం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీ.ఎస్.ఆర్.కృష్ణమూర్తి చేతుల మీదుగా విన్నర్స్, రన్నర్స్‌కు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ కె.రామచంద్రయ్య, క్రీడాభారతి సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వరప్రసాద్, కార్యదర్శి డి.రవి పాల్గొన్నారు.

తొక్కిసలాటలో కోలుకున్న భక్తులకు ప్రత్యేక వైకుంఠద్వార దర్శనం



తిరుమల, జనవరి12(ఆంధ్రజ్యోతి): వైకుంఠద్వార దర్శనం టోకెన్ల జారీ కేంద్రాల వద్ద జరిగిన తొక్కిసలాటల్లో గాయపడి కోలుకున్న 28 మంది భక్తులకు టీటీడీ ఆదివారం ప్రత్యేకంగా వైకుంఠద్వార దర్శనం కల్పించింది. 8వ తేదీ రాత్రి తిరుపతిలో జరిగిన తొక్కసలాట ఘటన లో ఆరుగురు చనిపోవడంతో పాటు పలువురు గాయపడిన విషయం తెలిసిందే. ఇక, మృతుల కుటుంబ సభ్యులకు రూ.25 లక్షల చొప్పున, తీవ్రంగా గాయపడిన ఇద్దరికి రూ.5 లక్షల చొప్పున, మరో 31 మంది క్షతగాత్రులకు రూ.2 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వాలని టీటీడీ బోర్డు తీర్మానించింది. ఇందులో భాగంగానే శనివారం రాత్రి ఏడుగురు బాధితులకు టీటీడీ చైర్మన్ పరిహారాన్ని అందజేశారు. కోలుకున్న 28 మంది భక్తులకు టీటీడీ ఆదివారం ఉదయం ప్రత్యేక వైకుంఠద్వార దర్శనం కల్పించింది. ప్రొటోకాల్ కేటగిరీలో వీరిని ఆలయంలోకి అనుమతించి దర్శనం చేయించారు.

ప్రభుత్వం, టీటీడీకి ధన్యవాదాలు

టోకెన్ల కోసం క్యూలైన్‌లో ఉన్నప్పుడు అనుకోకుండా తొక్కిసలాట జరిగింది. బాగా గాయపడ్డాం. ప్రభుత్వం వెంటనే స్పందించి మంచి వైద్యం అందించింది. మంచి దర్శనం చేయించడంతో పాటు తిరిగి మా సొంతూర్లకు పంపుతున్నారు. సీఎం చంద్రబాబు, ప్రభుత్వం, దేవస్థానం అధికారులకు పేరుపేరున ధన్యవాదాలు తెలుపుతున్నాం. రాత్రి చైర్మన్ రూ.5 లక్షల పరిహారం అందించారు. వారికి రుణపడి ఉంటాం.

- ఈశ్వరమ్మ, నాగరాజు దంపతులు

ముందస్తు భోగి సంబరాలు



తిరుపతి అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తాతానగర్‌లో ఆదివారం రాత్రి ముందస్తు సంక్రాంతి సంబరాలు చేశారు. పెద్దలు, యువత ఉత్సాహంగా భోగి మంటలు వేశారు. తాతానగర్ యువజన సంఘం నాయకులు గోపినాథరెడ్డి, మనోహర్‌రెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి, చెంగారెడ్డి, కె.ఎస్.రాజా, సుబ్రహ్మణ్యం, చందు, మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీలకు మైదానం సిద్ధం



చంద్రగిరి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): భోగి పండుగ రోజున నారావారిపల్లెలో చుట్టుప్రక్కల గ్రామాల్లోని మహిళలకు, పిల్లలకు ప్రతిఏటా నారా భువనేశ్వరి ఆధ్వర్యంలో వివిధ క్రీడా, రంగవల్లుల పోటీలు నిర్వహిస్తారు. ఈ ఏడాది వీటి నిర్వహణకు ఇంటి సమీపంలో క్రీడామైదానం సిద్ధం చేశారు. స్థానికులకు క్రీడా, రంగవల్లుల పోటీలు నిర్వహించడానికి క్రీడామైదానం సిద్ధం చేశారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఈపోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నారు.

కుటుంబ కలహాలకు మరో ఇద్దరు పిల్లల బలి

నగరి వుదంతం మరువకముందే సదుంలో అలాంటి సంఘటన


సదుం ఆస్పత్రి మార్చురీలో షేక్ సిర్దా, షేక్ జారా ఫాతిమా మృతదేహాలు

సదుం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలకు మరో ఇద్దరు పిల్లలు బలైపోయారు.నగరిలో శనివారం ఇద్దరు ఆడ పిల్లలను తల్లే బావిలో తోసేయగా చనిపోయిన విషయం మరువక ముందే అత్త మీద కోపంతో ఓ తల్లి క్షణికావేశంలో తన ఇద్దరు పిల్లల్ని కడతేర్చిన సంఘటన ఆదివారం సదుంలో వెలుగు చూసింది.అత్తతో జరిగిన వాగ్వాదంతో మనస్తాపం చెందిన ఆమె , తన ఇద్దరు పిల్లలకు తానే ఉరి వేసి చంపేయడమే కాకుండా తానూ ఆత్మహత్యకు యత్నించింది. దీనిని గుర్తించిన కుటుంబసభ్యులు తేరుకునేలోపు పిల్లలిద్దరూ విగతజీవులుగా మారిపోగా, తల్లి మాత్రం ప్రాణాపాయం నుంచి బయటపడింది.పోలీసుల కథనం మేరకు.... సదుం మసీదు వీధిలో షేక్ మన్సూర్ తన తల్లి గవహర్ జాన్, భార్య షేక్ కరిష్మా(27), కుమార్తెలు షేక్ సిర్దా(2), షేక్ జారా ఫాతిమా(1)లతో కలిసి కాపురం ఉంటున్నాడు. అత్తా కోడళ్లైన కరిష్మా, గవహర్ జాన్ మధ్య తరచూ వాగ్వాదం జరుగుతుండేది. ఆదివారం మధ్యాహ్నం 4 గంటల ప్రాంతంలోనూ వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపం చెందిన కరిష్మా తన ఇద్దరు పిల్లలను ఇంటిలోని పైఅంతస్థులోని గదిలోకి తీసుకెళ్లి విద్యుత్ వైర్లతో ఉరి వేసేసింది. ఆ తరువాత తాను కూడా ఉరి వేసుకుంది. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు గది తలుపులు పగలగొట్టి వారిని కాపాడే ప్రయత్నం చేశారు. హుటాహుటిన సదుం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారులిద్దరూ మరణించారని వైద్యులు తేల్చారు. కరిష్మా మాత్రం గొంతు వద్ద గాయంతో బతికి బయటపడింది.పూర్తి వివరాలు పోలీసుల విచారణలో వెలుగులోకి రావాల్సి ఉంది.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో కార్మికుల మధ్య ఘర్షణ


గాయపడిన ఆర్ముగం

తిరుమల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే రాంభగీచ బస్టాండ్ వద్ద ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో ఇద్దరు కార్మికుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఒకరు గాయపడ్డారు. కర్ణాటకకు చెందిన రాహుల్, పళణికి చెందిన ఆర్ముగం తిరుమలలోని హోటళ్లలో వర్కర్లుగా ఉంటున్నారు. వీరి మధ్య కుటుంబ కలహాలు ఏర్పడ్డాయి. ఆదివారం వాగ్వాదానికి దిగారు. మాటమాటా పెరగడంతో సహనం కోల్పోయిన రాహుల్ బ్లేడ్ రేజర్‌తో ఆర్ముగంపై దాడి చేశారు. ఆర్ముగం పెదవులు, గొంతుకు గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమైంది. గుర్తించిన తోటి వర్కర్లు అడ్డుకుని, గాయపడిన ఆర్ముగంను అశ్విని ఆస్పత్రికి తరలించారు. ఎలాంటి ప్రమాదమూ లేదని వైద్యులు తెలిపారు. పోలీసులు వారిని విచారిస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.43 కోట్లు

తిరుమల, జనవరి12(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.43 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.43 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది.

పేరూరు బాలసుబ్రమణ్యంకు సన్మానం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని నాగయ్య కళా క్షేత్రంలో రచయిత పేరూరు బాలసుబ్రమణ్యంను చిత్తూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక, ధృవీకరణ పత్రంతో ఆయన్ను సన్మానించారు. సాహిత్యానికి బాలసుబ్రమణ్యం చేసిన కృషిని చిత్తూరు రచయితల సంఘం అధ్యక్షుడు మహదేవ నాయుడు కొనియాడారు.

ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా ఎల్.విజయ్ భారత్ రెడ్డి

తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా ఎల్.విజయ్ భారత్‌రెడ్డి నియమితులయ్యారు. రెవిన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం డెప్యుటేషన్‌పై పరిశ్రమల శాఖకు బదిలీ చేసింది. అందులో భాగంగా ఆయనను తిరుపతి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది.

నేడు సోలార్ విద్యుత్ కనెక్షన్లు ప్రారంభం

తిరుపతి(ఆటోనగర్) జనవరి 12 (ఆంధ్రజ్యోతి): నారావారిపల్లి గ్రామంతో పాటు సమీపంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సోమవారం సీఎం చంద్రబాబు సోలార్ విద్యుత్ కనెక్షన్లను ప్రారంభించనున్నట్లు తిరుపతి రూరల్ డివిజన్ ఈఈ వాసురెడ్డి తెలిపారు. సోలార్ ప్యానల్స్ ఏర్పాటుకు నెల రోజులుగా తిరుపతి రూరల్ డివిజన్ ఆపరేషన్ ఈఈ, నిర్మాణాల విభాగం అధికారులు ఇంటింటి సర్వే నిర్వహి ంచారు. సోమవారం 15 ప్యానల్స్ ప్రారంభించే అవకాశముంది.

ఐదు నెమళ్ల మృత్యువాత



రామకుప్పం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బల్ల పంచాయతీ లక్ష్మీపురం సమీపంలోని అటవీ సరిహద్దుల్లో ఐదు నెమళ్లు మృత్యువాత పడ్డాయి. ఆదివారం ఉదయం స్థానికులు రెండు నెమళ్లు చనిపోయి ఉండటాన్ని గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. అటవీ ఉపక్షేత్రాధికారి ధనంజయుడు సిబ్బందితో రాగా అక్కడికి చేరువలోనే శాంతిపురం మండలం శివరామపురానికి చెందిన రైతు రమేష్‌రెడ్డికి చెందిన పొలం పక్కనే మరో మూడు నెమళను పూడ్చిపెట్టారని చెప్పారు. దీంతో చుట్టుపక్కల గాలించి పూడ్చిపెట్టిన ఐదు నెమళ్ల కళేబరాలను వెలికి తీశారు. రమేష్ రెడ్డి తన పొలంలో పుచ్చకాయలను సాగు చేస్తున్నాడు. వన్యప్రాణులు తోటల వైపు రాకుండా తోట చుట్టూ విషపు గుళికలు చల్లాడని.. అవి తిన్నందునే నెమళ్లు మృత్యువాత పడ్డాయని స్థానికులు, అటవీ అధికారులు అభిప్రాయపడుతున్నారు. చనిపోయిన నెమళ్లను పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపుతున్నట్లు ధనంజయుడు తెలిపారు. ఫలితాలు వచ్చిన అనంతరం చర్యలు చేపడతామన్నారు.

ప్రశాంతంగా వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ



విష్ణు నివాసం వద్ద టోకెన్ల జారీ

తిరుపతి అర్బన్ : స్థానిక శ్రీనివాసం కాంప్లెక్స్‌లో వైకుంఠ ద్వారాల టోకెన్ల జారీ ప్రక్రియ ఆదివారం ప్రశాంతంగా కొనసాగింది. వచ్చినవారు వచ్చినట్లుగా టోకెన్లు స్వీకరించి వెనుతిరగడం కనిపించింది. వైకుంఠ ఏకాదశి, ద్వాదశి, త్రయోదశి టోకెన్లు 9వ తేదీన జారీచేసిన విషయం తెలిసిందే. మిగిలిన ఏడు రోజులకు సంబంధించిన టోకెన్ల జారీ ప్రక్రియను శనివారం రాత్రి 9.30 గంటలకు ప్రారంభించారు. డిప్యూటీ ఈవో ఆనందరావు పర్యవేక్షణలో టీటీడీ, పోలీసు, భద్రతా విభాగాల సమన్వయంతో భక్తులకు సేవలందించారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

విష్ణు నివాసంలో..

తిరుపతి (జీవకోన) : విష్ణునివాసంలో ఆదివారం టోకెన్ల జారీ ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగింది. సాయంత్రం 5.25 గంటల వరకు 13వ తేదీ టోకెన్లను జారీ చేశారు. అనంతరం 14వ తేదీకి సంబంధించి టోకెన్ల ప్రక్రియ కొనసాగింది. 14 కౌంటర్ల ద్వారా మంజూరు చేస్తున్నారు. డిప్యూటీ ఈవోలు పద్మావతి, విజయభాస్కర్‌లు పర్యవేక్షిస్తున్నారు. వీరితో పాటు 19 మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, కౌంటర్ల వద్ద ఇన్‌చార్జిగా ఒక సూపరింటెండెంట్, ఇద్దరు సూపర్‌వైజర్లు ఉన్నారు. అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు.

భూదేవి కాంప్లెక్స్‌లో..

తిరుపతి(వైద్యం): భూదేవి కాంప్లెక్స్‌లో ఆదివారం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ భక్తులకు టోకెన్లను అందించారు. క్యూలైన్ల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలూ చోటుచేసుకోకుండా పోలీసులు, టీటీడీ విజిలెన్స్ గట్టి భద్రతా చర్యలు చేపట్టారు. జేఈవో వీరబ్రహ్మం, జేసీ శుభం బన్సల్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రత్యేక చర్యలు చేపట్టారు.



శ్రీనివాసం వద్ద తీసుకున్న టోకెన్లు చూపుతున్న భక్తులు



శ్రీనివాసం వద్ద అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు



బస్టాండులో తనిఖీలు నిర్వహిస్తున్న నరసింహులు

ఇన్‌చార్జ్ డీపీటీవో ఆకస్మిక తనిఖీలు

తిరుపతి(ఆర్టీసీ), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జ్ డీపీటీవో నరసింహులు ఆదివారం సెంట్రల్ బస్టాండులో ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్లాట్‌ఫారాల వద్ద కండక్టర్, డ్రైవర్ల పనితీరును పరిశీలించారు. ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలను గమనించి, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఆవరణలో విచ్చలవిడిగా ఆగివున్న బస్సులను చూసి ఆగ్రహించారు. వరుస క్రమంలో ఆపాలని, ఖాళీ పడినప్పుడు ప్లాట్‌ఫామ్ వద్దకు చేరుకోవాలని ఆదేశించారు. రిజర్వేషన్ కౌంటర్లను పరిశీలించారు. ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని దుకాణదారులకు సూచించారు.

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి



విద్యార్థికి జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తున్న రామకృష్ణమఠం విశ్వరాజనందస్వామి

తిరుపతి అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలని సెట్విన్ సీఈవో కె.మోహన్‌కుమార్ అన్నారు. యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఎస్వీ మెడికల్ కాలేజీ కూడలిలో వివేకానంద జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత ఆధ్యాత్మిక విలువలను ప్రపంచానికి చాటిన తత్వవేత్త, దేశ సాంస్కృతిక వైభవాన్ని విశ్వవ్యాప్తి చేయడంలో ఎనలేని కృషి చేసిన మహనీయుడు వివేకానంద అని గుర్తుచేశారు. రామకృష్ణమఠం విశ్వరాజనందస్వామి మాట్లాడుతూ లక్ష్యం నెరవేరేంత వరకు విశ్రమించవద్దని వివేకానందుడు గొప్పసందేశమిచ్చారని తెలిపారు. వ్యాసరచన, సాంకేతిక, చర్చగోష్టి పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రామకృష్ణమఠం ప్రతినిధులు మురళీకృష్ణప్రసాద్, సెట్విన్ సిబ్బంది పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాల సమ్మేళనం సంక్రాంతి

తిరుపతి అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాల సమ్మేళనమే సంక్రాంతి పండుగ అని, అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆకాంక్షించారు. ఈ పండుగ అందరి జీవితాల్లో కొత్తవెలుగులు నింపాలని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు.

బ్రహ్మోత్సవ బహుమానం జీవోపై హర్షం

తిరుపతి అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): టీటీడీ రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానానికి సంబంధించి ఆదివారం విడుదల చేసిన జీవోపై ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. టీటీడీ ఉద్యోగులు, అసోసియేషన్ తరఫున ఆయన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.



సీఎంకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే, తనయుడు జగన్

సీఎంకు స్వాగతం

తిరుపతి అర్బన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు రేణిగుంట విమానాశ్రయంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆయన తనయుడు జగన్ స్వాగతం పలికారు. శాలువకప్పి సన్మానించారు. భోగి, సంకాంత్రి శుభాంక్షలు తెలియజేశారు.

శ్రీవారి సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి



ఆలయం ముందు జస్టిస్ శ్రీసుధ

తిరుమల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీసుధ ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.ఉదయ వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని, తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. ఉత్తరద్వార ప్రవేశం చేసి రంగనాయక మండపానికి చేరుకున్న ఆమెకు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

వైకుంఠ మహాప్రస్థానంలో నీటి సమస్య



నీరు రాని కొళాయిలు

తిరుపతి (జీవకోన), జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : నగర పరిధిలోని హరిశ్చంద్ర శ్మశాన వాటికలో నీటి సమస్య మొదలైంది. తెలుగు గంగ నీళ్ల పంపింగ్ సమయంలో మాత్రమే ఇక్కడ నీరు వస్తుంది. తర్వాత రావడం లేదు. అంత్యక్రియలు, కర్మక్రియ లు నిర్వహించే సమయంలో నీటి అవసరం చాలా ఉంటుంది. తలకొరివి పెట్టినవారు స్నానమాచరించడం, వచ్చిన బంధువర్గ మిత్రులు కాళ్లు చేతులు శుభ్రం చేసుకోవడం వంటివి చేస్తుంటారు. నీరు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి శ్మశాన వాటికలో బోరు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గెస్ట్ టీజీటీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతిరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జూపార్క్ రోడ్డులోని మహాత్మ జ్యోతిరావుపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో గెస్ట్ టీజీటీ ఇంగ్లీషు పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రేష్మ పేర్కొన్నారు. అభ్యర్థులు ఏదేని డిగ్రీతోపాటు బీ.ఎడ్‌లో ఇంగ్లీషు మెథడాలజీ ఉండాలని, ఇంగ్లీషు మాధ్యమంలో చదివి, బోధనా అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేయాలని కోరారు. ఇతర వివరాలకు 9000783185ను సంప్రదించాలని కోరారు.

వినాయకస్వామి ఆలయంలో చోరీ

● హుండీలను ఎత్తుకెళ్లిన దుండగులు



ఖాళీ హుండీలు

తిరుమల, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుమల బాలాజీనగర్‌లోని వినాయక స్వామి ఆలయంలో ఆదివారం చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు రెండు హుండీలను ఎత్తుకెళ్లారు. వాటిలోని సొత్తు అపహరించి ఖాళీ హుండీలను పక్కనే ఉన్న భవనంలో వదిలి పరారయ్యారు. శనివారం రాత్రి తాళాలు వేసి వెళ్లిన పూజారులు ఆదివారం ఉదయం గేట్లు తెరిచి చూడగా రెండు హుండీలు కనిపించలేదు. పక్కనే ఉన్న కమ్యూనిటీ హాల్‌లో ఖాళీ హుండీలు ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఆలయం లోపల నుంచి ఉన్న ఓ చెట్టు కోసం రేకులను కట్ చేసి ఉంచారు. ఇక్కడి నుంచే దుండగులు ఆలయంలోకి ప్రవేశించి ఉండవచ్చన్న అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్లూస్ టీం ద్వారా వేలి ముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీలో ఇప్పటికీ వైసీపీ ఆలోచనలే..!

● ఆగమశాస్త్రం పేరుతో భక్తుల మనోభావాలతో చెలగాటాలొద్దు ● టీటీడీ మాజీ పాలకమండలి సభ్యుడు ఓవీ రమణ



తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలవుతున్నా ఏడుకొండల వాడి సన్నిధిలో వైసీపీ ఆలోచనలే కొనసాగించడంలో ఆంతర్యం ఏమిటని టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు, టీడీపీ సీనియర్ నేత ఓవీ రమణ ప్రశ్నించారు. ఆదివారం ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ తిరుమల వేంకటేశ్వర స్వామి చెంత అహంకారంతో వ్యవహరించినా, అపచారాలకు పాల్పడినా పతనం తప్పదని అనేక సంఘటనలు రుజువు చేశాయని తెలిపారు. తిరుపతిలో తొక్కిసలాట ఘటనపై సమగ్రంగా దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిరుమల శ్రీవారి ఆలయంలో తరతరాలుగా వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రెండు రోజులు మాత్రమే వైకుంఠ ద్వారాలు తెరిచి ఉంచే విధానం ఉందని, అయితే గత వైసీపీ ప్రభుత్వం పది రోజులకు వైకుంఠ ఏకాదశి పర్వదినాలను పెంచడం ఏ ఆగమ శాస్త్రం చెబుతోందని ప్రశ్నించారు. కస్టమ్స్ అధికారిగా ఉన్న వ్యక్తిని తిరుమలకు తీసుకువచ్చి అధికారం అప్పగిస్తే ఆయనకు సామాన్య భక్తుల కష్టాలు తిరుమల ఆచార వ్యవహారాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. మఠాధిపతులు, పీఠాధిపతులు స్వార్థ ప్రయోజనాల కోసం టీటీడీ ప్రతిష్టను మసక బారేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆగమ శాస్త్రం పేరుతో ఆగడాలు చేస్తే స్వామి క్షమించరని, వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుందని తేల్చి చెప్పారు. మేధావులు, అనుభవజ్ఞుల సలహాలు సూచనలు పాటించి తిరుమల ప్రతిష్టను మరింత పెంచే విధంగా పాలకమండలి పని చేయాలని ఆ దిశగా ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలని కోరారు.

మిన్నంటిన సంక్రాంతి సంబరాలు







తిరుపతి (జీవకోన) : తిరుపతి వినాయక నిమజ్జన కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఆదివారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. ఆటపాటలు కేరింతల నడుమ గాలిపటాల పండుగ వైభవంగా చేపట్టారు. పిల్లలు బొంగరాలు, గోలీలాటలు, కబడ్డీ ఆడారు. కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ ఏటా సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాసులు, సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, గుండాల గోపినాథ్‌రెడ్డి, ఊకా విజయకుమార్, ఎస్వీఎం వెంకటేష్, చెంగారెడ్డి, రెడ్డిబాబు, మల్లారపు వాసు, గోపి, ప్రసాద్, కీర్తి వెంకయ్య, చెన్నూరు సుబ్రహ్మణ్యం, ప్రసాద్, వరప్రసాద్, ప్రభాకర్‌నాయుడు పాల్గొన్నారు.






రంగవల్లులు వేస్తున్న మహిళలు - చిన్నారుల నృత్య ప్రదర్శన

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

తిరుచానూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా చేపట్టిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. మహిళలు అందమైన ముగ్గులు వేసి, రంగులు అద్దారు. ఏవో ఖాదరవల్లి విజేతలకు బహుమతులు అందజేశారు. కాగా, చిన్నారులు భారతనాట్య ప్రదర్శన చేశారు. పలు కీర్తనలకు చేసిన నృత్య ప్రదర్శన అలరించింది. వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ముగిసిన సంక్రాంతి పుస్తకాల పండుగ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సంక్రాంతి పుస్తకాల పండుగకు ఊహించని రీతిలో స్పందన వచ్చింది. తిరుపతి బాలాజీ కాలనీలోని ఎస్వీ హైస్కూల్ మైదానం ఎదురుగా రెండు రోజులుగా పుస్తక ప్రదర్శన సాగింది. సగం ధరకే విలువైన పుస్తకాలు లభించడంతో చిన్నారులు, యువత, ఉద్యోగులు పెద్ద ఎత్తున కొనుగోలు చేశారు. కథలు, నవలలు, నాటకాలు, పాటలు, పద్యాలు, జీవిత చరిత్రలు వంటి పుస్తకాలు అమ్మకానికి ఉంచారు. ప్రాచీన, ఆధునిక సామాజిక, ఆర్థిక, సాహిత్య, చారిత్రక, రాజకీయ, సాంస్కృతిక అంశాలకు సంబంధించిన విలువైన పుస్తకాలనూ ప్రదర్శనలో ఉంచారు. తిరుపతిలోని విద్యార్థులు, ఉపాధ్యాయులు, తెలుగు భాషా, సాహిత్యాభిమానులు సద్వినియోగం చేసుకున్నారు.



పుస్తకాలను కొన్న ఆనందంలో చెన్నైకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కుటుంబం

సీఎంను సత్కరించిన రుద్రకోటి



తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడిని ఆదివారం రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం సత్కరించి, స్వాగతం పలికారు.

వివేకానందకు ఘన నివాళి



వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

తిరుపతి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా టీడీపీ నాయకుడు పాటకం వెంకటేష్ ఆధ్వర్యంలో ఎస్వీ మెడికల్ కాలేజ్ సర్కిల్లోని వివేకానంద విగ్రహానికి గజమాలవేసి, నివాళులర్పించారు. యువతలో చైతన్యం, దేశభక్తిని నింపేందుకు ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆముదాల తులసీరాం, మునిశేఖర్ రాయల్, కరాటే చంద్ర, మునిరామయ్య, అద్దంకి బాలు, నరేష్ చౌదరి, సురేష్, కోదండరాములు పాల్గొన్నారు.

వివేకానందుడికి ఘన నివాళి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్వామి వివేకానంద 162వ జయంతి సందర్భంగా ఎస్వీయూలో ఆయన చిత్రపటానికి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు పుష్పాంజలి ఘటించారు. వారు మాట్లాడుతూ వివేకానందుడు ఈ తరానికి స్ఫూర్తి అని తెలిపారు. కొత్తతరం వివేకానందుడి భావాలు తెలుసుకోవడం ద్వారా మంచి మార్గంలో నడవాలని కోరారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ బీవీ మురళీధర్, డాక్టర్ కళ్యాణ్, కల్చరల్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్లు వివేక్, హరికృష్ణ, విద్యార్థులు,ఉద్యోగులు పాల్గొన్నారు.



వివేకానందుడి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధికారులు

ఇలాగైనా ఉపయోగపడుతున్నాయి

శునకాలకు ఆసరాగా బ్యాటరీ వాహనాలు



బ్యాటరీ వాహనాల్లో సేదతీరుతున్న కుక్క

తిరుపతి(వైద్యం), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో రోగులను వార్డులకు, ఓపీలకు తీసుకువెళ్లేందుకు ఉపయోగపడిన బ్యాటరీ వాహనాలు అధికారుల నిర్లక్ష్యం కారణంగా కుక్కలకు అడ్డాగా మారాయి. రోగుల సౌకర్యార్థం దాతలు రెండు బ్యాటరీ వాహనాలను అందించారు. కొంతకాలం వాటిని ఉపయోగించిన అధికారులు చిన్నపాటి మరమ్మతులు రావడంతో పక్కన పడేశారు. వీటిల్లో కుక్కలు సేదతీరుతున్నాయి. అధికారులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

కపిలేశ్వరాలయంలో ముగిసిన తెప్పోత్సవాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరాలయంలో ఐదు రోజులుగా చేపట్టిన తెప్పోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరి రోజున చండీకేశ్వరస్వామి, చంద్రశేఖర స్వామి తెప్పలపై తొమ్మిది చుట్లు తిరిగి భక్తులకు దర్శనమిచ్చారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు సంకీర్తనలు ఆలపించారు. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్ర, ఏఈవో కోనేటి సుబ్బరాజు, ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.



తెప్పపై విహరిస్తున్న స్వామివార్లు

అమ్మవారి సేవలో ప్రముఖులు



జస్టిస్ నరేంద్ర - జస్టిస్ లలిత

తిరుచానూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఉత్తరాఖండ్ చీఫ్ జస్టిస్ జి.నరేంద్ర కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, సూపరింటెండెంట్ రమేష్ వారికి స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి, సన్నిధిలోని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ లలిత అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





అనగాని సత్యప్రసాద్ - తమన్

తిరుమల,జనవరి12 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్, సంగీత దర్శకుడు తమన్ ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకుని,ఉత్తరద్వార ప్రదక్షిణ చేశారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

బకాయిల చెల్లింపుపై హర్షం

తిరుపతి(నేరవిభాగం),జనవరి12(ఆంధ్రజ్యోతి): పోలీసు ఉద్యోగులకు సంవత్సరం పాటు పెండింగ్‌లో ఉన్న అడిషనల్ సరెండర్ లీవు బిల్లులు, జీపీఎఫ్, సీపీఎస్ బకాయిలను వెంటనే మంజూరు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమని జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి తెలిపారు. సీఎంకు జిల్లా పోలీసు ఉద్యోగులు, సిబ్బంది తరఫున ధన్యవాదాలు తెలుపుతూ ప్రకటన విడుదల చేశారు.

ఎస్పీ శుభాకాంక్షలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు, పోలీసు సిబ్బందికి ఎస్పీ మణికంఠ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలు ఆనందభరితంగా, ఉత్సాహంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రతి ఇంటా సంతోషకరమైన వాతావరణం నెలకొనాలని కోరారు.

పుత్తూరు వార్తలు

అనుమతుల్లేని పీజీ హోంలు

ప్రభుత్వ ఆదాయానికి గండి

పుత్తూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదాయానికి లక్ష రూపాయల్లో గండికొడుతూ అనధికారికంగా పట్టణంలో పేయింగ్ గెస్ట్ హోంలు వెలుస్తున్నాయి. తిరుపతి తర్వాత వివిధ విద్యాసంస్థలు పుత్తూరులోనే ఏర్పాటు చేశారు. వేలల్లో విద్యార్థులు, వందల్లో ఉద్యోగులు పట్టణంలో నివసిస్తున్నారు. కళాశాలల హాస్టళ్లల్లో విద్యార్థులకు తగిన వసతి లేకపోవడం, ఉన్న చోట ఖర్చులను భరించలేక విద్యార్థులు పేయింగ్ గెస్ట్ హోంలను ఆశ్రయిస్తున్నారు. డిమాండ్ పెరగడంతో తమ నివాస భవనాలను యజమానులు హాస్టళ్లుగా నిర్వహిస్తున్నారు. అయితే పేయింగ్ గెస్ట్ హోంలు నిర్వహించడానికి వాణిజ్య నిలయాల కింద మున్సిపల్ శాఖ డీ అండ్ ఓటీ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు, అగ్నిమాపక శాఖ, విద్యుత్ శాఖల అనుమతి తప్పని సరి. నిబంధనల మేరకు బాలికల రక్షణ కోసం భవనాల్లో సీసీ కెమెరాల అమరిక, సెక్యూరిటీ సిబ్బందిని నియమించుకోవాల్సి ఉంది. ఈ అనుమతుల కింద ప్రతి హాస్టల్ నిర్వాహకుడు ఏడాదికి రూ.లక్షల్లో పన్నులను ప్రభుత్వానికి చెల్లించాల్సి వుంది. అనుమతులు తీసుకోక పోగా కనీసం బోర్డు కూడా పెట్టకుండా దర్జాగా నడుపుకుంటున్నారు. పట్టణంలో దాదాపు 50 పేయింగ్ గెస్ట్ హోంలు ఉండగా ప్రధానంగా తిరుపతి - చెన్నై రోడ్డు, వాటర్ ట్యాంకు వీధి, ఎన్‌జీవో కాలనీ, నారాయణవనం రైల్వే గేటు తదితర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో ఉన్నాయి. ఈ విషయమై అగ్నిమాపక అధికారి నేతాజీని వివరణ కోరగా.. 11 పేయింగ్ గెస్ట్ హోంలు నోటీసులు ఇచ్చి ప్రభుత్వానికి నివేదిక పంపామని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్‌ను వివరణ కోరగా.. గతంలో తమ పరిధిలో వున్న ఫుడ్ ఇన్‌స్పెక్షన్ అధికారాన్ని జిల్లా వైద్యఆరోగ్యశాఖకు అప్పగించారని తెలిపారు. డేంజరస్ మరియు అఫెన్సివ్ ట్రేడ్ (డీ అండ్ ఓటీ) కింద అనుమతి ఇవ్వాల్సి వుందని తెలిపారు. బోర్డులు లేనందున వాణిజ్య కేటగిరీ కింద కాకుండా నివాస కేటగిరీ కింద విద్యుత్ బిల్లులు ఇస్తున్నామని ఏఈ సాయి తెలిపారు. అనుమతులు లేని ఇలాంటి పేయింగ్ గెస్ట్ హోంలలో ఏదైనా ప్రమాద సంఘటనలు జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు ముందస్తు జాగ్రత్తలతో పాటు ప్రభుత్వానికి ఆదాయాన్ని రాబట్టాల్సిన అవసరం ఎంతైనా వుంది.

ఘనంగా వివేకానంద జయంతి

పుత్తూరు టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పుత్తూరు వివేకానంద పాఠశాలలో వివేకానందుడి 163వ జయంతి వేడుకలు ఘనంగ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సదాశివం వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివేకానందుని చిత్రపటంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.

వడమాలపేట(ఆంధ్రజ్యోతి): నేటితరం యువత వివేకానందుడిని ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత వెంకమరాజు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గంధపుదళితవాడలో నెహ్రూ యువజన సేవా సంఘ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి జాతీయ యువజన దినోత్సవం నిర్వహించారు. జ్యోతిలక్ష్మి , నాదముని, రామాంజనేయులు, మంజుల, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



మినీ గోకులాన్ని ప్రారంభిస్తున్న గంజి మాధవయ్య

పుత్తూరు టౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య పేర్కొన్నారు. తొరూరు పంచాయితీ పైడిపల్లిలో రూ.2.30 లక్షలతో రైతు జ్యోతికుమార్ నిర్మించిన మిని గోకులం షెడ్డును గంజి మాధవయ్య ప్రారంభించారు. బాలాజీ, గజపతి, చిన్న, బాలకృష్ణరెడ్డి, మహేష్, హరిగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక ప్రగతి కోసమే మినీ గోకులం



ఎస్‌బీఆర్‌పురంలో మినీ గోకులాన్ని ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

వడమాలపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పాడిపరిశ్రమను అభివృద్ధి చేస్తూ రైతులు ఆర్థిక ఎదుగుదల కోసమే ప్రభుత్వం మినీ గోకులాలు ఏర్పాటు చేస్తోందని చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు చెప్పారు. ఆదివారం మండలంలోని ఎస్‌బీర్ పురం, పాదిరేడు, చింతకాల్వ గ్రామాల్లో మినీ గోకులాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ మణిరాజు, పెదద్పరాజు, వెంకటేశ్వర రావు, రవి, చందు, సురేష్, శ్యామయ్య, జగదీష్, వెంకటేష్, రఘు, సూర్య యోగేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ల వితరణ

వడమాలపేట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీహెచ్‌పురంలో ఉన్న యువజన సంఘం సభ్యులకు వాలీబాల్ కిట్లను చిత్తూరు పార్లమెంట్ తెలుగుయువత ఉపాధ్యక్షుడు మునిశేఖర్ అందజేశారు. అలాగే పాదిరేడులో టీడీపీ నాయకుడు పూల గణపతిరాయల్ వాలీబాల్ కిట్లను అందజేశారు.

తెలుగు కీర్తి జాతీయ పురస్కారానికి ఎంపికైన ఎంఈవో హేమమాలిని



పిచ్చాటూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారానికి పిచ్చాటూరు ఎంఈవో హేమమాలిని ఎంపికయ్యారు. ఐఎస్‌వో గుర్తింపు పొందిన అంతర్జాతీయ సాహితి సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఈ అవార్డును ప్రదానం చేయనున్నట్టు ఆ సంస్థ సీఈవో కత్తిమండ ప్రతాప్‌నుంచి ఆహ్వానం అందినట్టు ఆమె తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక, తెలుగు అసోసియేషన్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం, వరల్డ్ పోయెట్రి అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో పురస్కారాన్ని అందుకోనున్నట్లు ఎంఈవో తెలిపారు. విధులు నిర్వహిస్తూ రచనలు, కవి సమ్మేళనాలు, గాయనిగా తెలుగుభాష సంస్కృతి, సాహిత్యం, కళల పరిరక్షణ కోసం తపిస్తున్న హేమమాలిని పురస్కారానికి ఎంపిక కావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



కళాకారులను సత్కరిస్తున్న కార్యక్రమ నిర్వాహకులు

శ్రీకాళహస్తి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని త్రినేత్ర నాట్యాలయం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సౌజన్యంతో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం రాత్రి ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శ్రీకాళహస్తి, తిరుపతి, నాయుడుపేట, వెంకటగిరి, సూళ్లూరుపేటకు చెందిన పలువురు చిన్నారులు జానపదం, భరతనాట్య ప్రదర్శనలు ఇచ్చారు. వారిని నిర్వాహకులు అభినందించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. భాస్కర్‌రెడ్డి, సాయిదత్త తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

లారీ బోల్తా: ఇద్దరికి గాయాలు

దొరవారిసత్రం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం కలగుంట సమీపంలోని జాతీయ రహదారిపై ఉన్న రైల్వేబ్రిడ్జి వద్ద ఆదివారం తెల్లవారు జామున వరికోత మిషన్ మినీ లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో లారీ డ్రైవరు కుమార్, ఆపరేటర్ మురళి స్వల్ప రక్తగాయాలతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. రేపల్లి నుంచి సత్యవేడుకు వరికోత మిషన్‌తో వెళుతున్న లారీ రైల్వేబ్రిడ్జి వద్ద అదుపుతప్పి బోల్తా పండింది. ఈ ప్రమాదంలో వరికోత మిషన్ తునాతునకలైంది. గాయపడిన లారీ డ్రైవరు కుమార్, ఆపరేటర్ మురళికి దొరవారి సత్రం ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అందించి సూళ్లూరుపేటకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

చిల్లకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు... పోలీస్‌స్టేషన్ సమీపంలో సుమారు 30 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని మహిళ రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి చిత్తూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన మహిళను నెల్లూరులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు

ఓజిలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాయని ఎస్‌ఐ స్వప్న హెచ్చరించారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచినట్లు తెలిపారు. సంక్రాంతి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఆమె ప్రజలను కోరారు.





నదిలో ఇసుకను నింపుకొనేందుకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు - కాళంగి నుంచి ఇసుకతో వెళ్తున్న ట్రాక్టర్లు

కాళంగిని ఖాళీ చేసేస్తున్నారు

- చెలరేగుతున్న ఇసుక మాఫియా
- చోద్యం చూస్తున్న అధికారులు

సూళ్లూరుపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక వ్యవహారంలో వేలు పెడితే సహించను.. ఎమ్మెల్యేలు, నేతలు జాగ్రత్తగా వ్యవహరించాలి.. ఉచిత ఇసుక విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతోంది.. మచ్చతెచ్చే విధంగా ఎవరూ వ్యవహరించవద్దు... పలుమార్లు ఎమ్మెల్యేలు, నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన హెచ్చరిక ఇది. అయితే ముఖ్యమంత్రి ఆదేశాలను పలువురు నాయకులు పెడచెవిన పెతుడున్నారు. ఉచిత ఇసుక విధానానికి తూట్లు పొడుస్తున్నారు. వివిధ మార్గాల్లో అక్రమాలకు తెర లేపుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. కొందరు అధికార పార్టీ నాయకులు కాళంగి నది నుంచి ఇసుక తవ్వి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సూళ్లూరుపేట డివిజన్ కేంద్రంలో పెద్ద ఎత్తున ఇసుక దందా సాగగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనూ ఇసుక మాఫియా చెలరేగిపోతోంది. ఎలాంటి అనుమతి తీసుకోకుండా ఇసుకను అక్రమంగా తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు. ప్రధానంగా కాళంగి నది తీరంలో ఇసుక అక్రమ తవ్వకాలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి. కాళంగి నుంచి గృహ అవసరాలకు అధికారుల అనుమతితో మాత్రమే ఇసుకను తీసుకోవాల్సి ఉంది. ఇతరత్రా అవసరాలకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రీచ్‌ల నుంచి మాత్రమే తీసుకోవాల్సి ఉంది. అయితే సూళ్లూరుపేట - తడ మధ్యలో ఉన్న కాళంగి రైల్వేబ్రిడ్జి వద్ద నుంచి నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారు. ఇందుకోసం వాటంబేడుకు వెళ్లే మార్గంలో రైల్వేట్రాక్ అంచున కాళంగిలోకి దారి ఏర్పరచుకొని రేయింబవళ్లు ఇసుకను తరలిస్తున్నారు. ఆదివారం ఒక్కసారిగా కాళంగిలోకి వరుసగా పదుల సంఖ్యలో ట్రాక్టర్ల వెళ్లడంతో సమీప గ్రామాలకు చెందిన ప్రజలు అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకొని ట్రాక్టర్లను పట్టుకొని వదిలేయడం గమనార్హం. ఇసుక మాఫియాకు అధికార పార్టీ నేతల అండదండలు ఉండటంతో పోలీసులు పట్టుబడిన ట్రాక్టర్లను వదిలేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఇసుక మాఫియాపై చర్యలు తీసుకొంటాం

కాళంగి నదిలో ఇసుక తవ్వకాలకు అనుమతి లేదు. ఉచిత ఇసుక కోసం ఆన్‌లైన్ నమోదు చేసి అనుమతి తీసుకోవాలి. కాళంగి రైల్వే బ్రిడ్జి వద్ద అక్రమ తవ్వకాలు నా దృష్టికి రాలేదు. నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకొంటాం.

- ఆర్డీవో కిరణ్మయి





గూడూరులోని రాజావీధిలో రద్దీ - జనాలతో కిక్కిరిసిన సూళ్లూరుపేట

పట్టణాల్లో పండుగ రద్దీ

గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినాలు సోమవారం నుంచి ప్రారంభం కానుడడంతో ఆదివారం గూడూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి పట్టణాలు జనాలతో కిక్కిరిశాయి. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి ప్రజలు వస్తువులను కొనుగోలు చేసేందుకు పట్టణానికి రావడంతో ఆదివారం గూడూరులో రద్దీ వాతావరణం నెలకొంది. భోగి, సంక్రాంతి పండుగకు దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలు చేసేందుకు సమీప గ్రామాల నుంచి ప్రజలు తరలిరావడంతో పాతబస్టాండు, ఆస్పత్రి రోడ్డు, టవర్‌క్లాక్ సెంటర్, రాజావీధి, గాంధీబొమ్మ తదితర ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ● సూళ్లూరుపేటలో సంక్రాంతి సంబరాలు ఆదివారమే ప్రారంభమయ్యాయి. పండుగ సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన జనంతో పట్టణమంతా కిక్కిరిసింది. బట్టలు షాపులు, పూజా సామగ్రి, ఫ్యాన్సీ షాపులన్నీ రద్దీగా కనిపించాయి. సుదూరు ప్రాంతాల్లో ఉండే బంధువులు, పిల్లలందరూ సొంత ఊళ్లకు పయనమవడంతో ఆర్టీసీ బస్టాండు ప్రయాణికులతో కిక్కిరిసింది. ● నాయుడుపేట పట్టణం జనాలతో కిక్కిరిసింది. పండుగ సరుకులు, బట్టలు తదితర సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజలతో దుకాణాలు కిటకిటలాడాయి. ● వెంకటగిరి పట్టణంలో సంక్రాంతి సందడి కనిపించింది. ప్రధాన వీధులన్నీ కిక్కిరిశాయి. ప్రజలు వస్త్రాలు విక్రయాలు కొనుగోలు చేశారు.





డివైడర్‌పై ఫ్లెమింగో పక్షుల ఆకారంలో మొక్కలు - అందమైన పూల మొక్కల ఏర్పాటు

గ్రీన్‌సిటీగా సూళ్లూరుపేట

సూళ్లూరుపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణాన్ని గ్రీన్ సిటీగా మార్చేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొంటున్నారు. సంకాంత్రి, పక్షుల పండుగ నేపథ్యంలో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణ రెడ్డి చొరవతో కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశాలతో మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారులు పట్టణంలో హోలిక్రాస్ కూడలి నుంచి చెంగాళమ్మ ఆలయం వరకు డివైడర్ల నడుమ దాదాపు కిలో మీటరు మేర మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కమిషనర్ చిన్నయ్య డివైడర్ల నడుమ పలు రకాల మొక్కలను దగ్గరుండి నాటించారు. ఈనెల 18 నుంచి మూడు రోజుల పాటు పక్షుల పండుగ జరగనున్న నేపథ్యంలో అక్కడక్కడ ఫ్లెమింగో పక్షులు, సంక్రాంతికి పొంగళ్లు పెట్టే పొంగలి కుండ తదితర ఆకారాలతో మొక్కలు, పలు రకాల పుష్పాలతో కూడిన అందమైన మొక్కలు నాటడంతో పట్టణంలో జీఎన్‌టీ రోడ్డు పచ్చదనంతో కళకళలాడుతోంది.





ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ వి.సునీల్, నటి గౌతమి - కార్యాలయ ప్రాంగణంలో పొంగళ్లు

అన్నాడీఎంకే కార్యాలయంలో

సంక్రాంతి సంబరాలు

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

ప్యారీస్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ఆశీస్సులతో ఆ పార్టీ ఎంజీఆర్ యువజన విభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ వి.సునీల్ అధ్యక్షతన సంక్రాంతి సంబరాలు ఆదివారం అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 915 మంది పాల్గొనగా, 23 జట్లు రంగవల్లికల్లో ప్రతిభ కనబరిచి ఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఆదివారం టి.నగర్‌లోని అన్నాడీఎంకే కార్యాలయంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ నటి, అన్నాడీఎంకే ప్రచార విభాగం ఉప కార్యదర్శి గౌతమి తొలి మూడు స్థానాల్లో నిలిచిన ఆర్.పద్మ - అర్చన, సంగీత - మహాలక్ష్మి, మైథిలి - మంజుల జంటలకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ వేడుకల్లో పార్టీ వైద్యవిభాగం సంయుక్త కార్యదర్శి డాక్టర్ శరవణన్ ఆత్మీయ అతిథిగా పాల్గొని, నిర్వాహకులను, విజేతలను అభినందించారు. అన్నాడీఎంకే టి.నగర్ ప్రాంతీయ సంయుక్త కార్యదర్శి కె.సూర్యకళ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి పొంగల్ కానుకలు అందించారు. వేదిక ప్రాంగణంలో పొంగిన పొంగలిని స్వామి వారికి నివేదించారు. ఈ వేడుకల్లో హరిబాబు, పద్మనాభన్, తేన్‌మొళి, జయరాయన్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.





మాజీ ఎమ్మెల్యే కిలివేటితో సూళ్లూరుపేట వైసీపీ పట్టణ, మండల అధ్యక్షులుగా నియమితులైన అనిల్‌రెడ్డి, కృపాకర్ రెడ్డి, పక్కన వైసీపీ నాయకుడు రామకృష్ణ తదితరులు - నాయుడుపేట పట్టణ అధ్యక్షుడు మాధవరెడ్డిని సన్మానిస్తున్న వైసీపీ నాయకులు

వైసీపీకి నూతన సారథులు

సూళ్లూరుపేట, వెంకటగిరి టౌన్, బాలాయపల్లి, నాయుడుపేట టౌన్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మండలం, పట్టణానికి నూతన సారథులను వైసీపీ నియమించింది. పార్టీ మండల అధ్యక్షు డిగా ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడిగా వెళ్లపాలెం కృపాకర్‌రెడ్డి నియమితులయ్యారు. వారిరువురూ ఆదివారం మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యను నెల్లూరులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. వీరితో పాటు వైసీపీ నాయకులు మీజూరు రామకృష్ణారెడ్డి, బద్దెపూడి మోహన్ రెడ్డి, ఎస్‌కే హుస్సేన్ ఉన్నారు. అలాగే వెంకటగిరి పట్టణ కన్వీనర్‌గా పులి ప్రసాదరెడ్డి, బాలాయపల్లి మండల అధ్యక్షుడిగా వెందోటి కార్తీక్‌రెడ్డిని నియమించారు. అదేవిధంగా నాయుడుపేట పట్టణ వైసీపీ అధ్యక్షుడుగా కలికి మాధవరెడ్డి నియమితులయ్యారు. ఆదివారం స్థానిక కేఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో మాధవరెడ్డిని వైసీపీ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు నాగార్జున, షబ్బీర్, నాయకులు కిషోర్‌యాదవ్, హరనాథ రెడ్డి, రాహుల్, చిట్టిబాబు, కృష్ణ పాల్గొన్నారు.





వెంకటగిరి పట్టణ కన్వీనర్ ప్రసాదరెడ్డి, బాలాయపల్లి మండల అధ్యక్షుడు కార్తీక్ రెడ్డి

రెవెన్యూ సదస్సుల అర్జీలపై ప్రత్యేక దృష్టి

తహసీల్దారు ద్వారకనాథరెడ్డి



పెళ్లకూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు పెళ్లకూరు తహసీల్దారు ద్వారకనాథరెడ్డి తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకున్తే క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రశ్న: ఎన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

జవాబు: మండలంలోని 28 రెవెన్యూ గ్రామాల్లో సభలు నిర్వహించాం. మొత్తం 203 అర్జీలు అందగా, వాటిలో 63 అక్కడిక్కడే పరిష్కరించాం. మిగిలిన వినతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తాం.

ప్రశ్న: ఎలాంటి సమస్యలపై అర్జీలు వచ్చాయి

జవాబు: ఎక్కువగా రీ సర్వేల్లో జరిగిన పొరపాట్లపై ఫిర్యాదులు అందాయి. సర్వే చేయాలని 26, పట్టాదారు పాసుపుస్తకాలు, అడంగళ్, 1బీ కరెక్షన్ తదతర సమస్యలపై 177 అర్జీలు వచ్చాయి.

ప్రశ్న: ప్రభుత్వ భూముల పరిరక్షణకు తీసుకునే చర్యలు

జవాబు: మండలంలో ఏ గ్రామంలో ప్రభుత్వ భూమి ఎంత ఉందో వివరాలు సేకరిస్తున్నాం. ఎక్కడైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

క్రికెట్ పోటీల నిర్వహణ అభినందనీయం



టీషర్టులను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): పండుగల్లో ఆటవిడుపుగా బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఈనెల 16,17,18 తేదీల్లో స్థానిక ఏఆర్‌డ్డి ప్రభుత్వ స్టేడియంలో బెస్ట్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు జరుగనున్నాయన్నారు. ఇందుకు సంబంధించి టీషర్టులను ఆదివారం స్థానిక శ్రీచైతన్య పాఠశాల వద్ద ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండే పలు శాఖల అధికారులకు, మీడియా ప్రతినిధులకు క్రికెట్ పోటీలు ఏర్పాటు చేయడం ఆనందదాయకమన్నారు. ఈ పోటీలలో రెవెన్యూ, న్యాయవాదులు, వైద్యులు, మున్సిపల్, వాకర్లు, మీడియా జట్లతో పోటీలను నిర్వహించడం శుభపరిణామన్నారు. కార్యక్రమంలో వేగూరు రాజేంద్రప్రసాద్, సురేష్, తూపిలి నాగేశ్వరరావు, నిమ్మకాయల రవి, సుబ్రమణ్యం, వేముల సునీల్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కేజీ ప్రకృతికుమార్

వెంకటగిరిటౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో వివేకానంద జయంతి వేడుకలను ఆదివారం ఏపీపీ ప్రకృతికుమార్ నిర్వహించారు. పేదలకు దుప్పట్లు, శాలువాలు, స్వీట్స్ పంపిణీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలకు క్యాలెండర్లు, చిన్నారులకు గిఫ్టు బాక్సులు అందజేశారు. కార్యక్రమంలో ఈశ్వరరావు, గోపీనాథ్, రవింద్, హరీష్, రాజగోపాల్, ధనంజయ, రాంప్రసాద్, గురవయ్య, వడ్లమూడి, అభిరామ్, లక్ష్మణ్, నీలకంఠం, రాజాబాబు పాల్గొన్నారు.

ఇనాం పట్టాలను రెగ్యులరైజ్ చేయండి

- సీఎం చంద్రబాబుకు వినతి

రేణిగుంట, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : తిరుచానూరు పరిధిలోని ఇనాం పట్టాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబుకు దామినేడు హౌసింగ్ సంక్షేమ సంఘం నాయకులు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంగా విమానాశ్రయంలో ఆయనను ఈ మేరకు విన్నవించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తిరుచానూరు పరిధిలో ప్రభుత్వ, రైల్వే విశ్రాంత ఉద్యోగులు స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుందామని అనుకుంటే నిషేదాజ్ఞలు విధించారని తెలిపారు. 2015 నుండి ఈ అంక్షలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన సీఎం ఈ విషయమై పరిశీలించాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సూచించారు. ఈ కార్యక్రమలో తులసీ ప్రసాద్, రాజు చిన్నప్పరెడ్డి, అంజిబాబు, వెంకటేశ్వరప్రసాద్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పాడి ఆవు మృతి

ఏర్పేడు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమందూరు పంచాయతీ బీసీ కాలనీకి చెందిన సుధాకర్ పాడి ఆవు ఆదివారం సాయంత్రం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గడ్డివామి వద్ద మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వైపు రావడంతో తీగకు తగిలింది. దీంతో పాడి ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. సూటి ఆవు మృతి చెందడంతో యజమాని ఆవేదన వ్యక్తం చేశారు.

20న విఘ్నేశ్వరస్వామి ఆలయ మహాకుంభాభిషేకం

శ్రీకాళహస్తి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరి కుమారస్వామి ఆలయ వద్ద ఉన్న విఘ్నేశ్వర మండపానికి మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఉదయం 9 నుంచి 10గంటల లోపు కుంభ లగ్నంలో మహాకుంభాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఈ- పంట నమోదు తప్పనిసరి

బుచ్చినాయుడుకండ్రిగ, 12 జనవరి (ఆంధ్రజ్యోతి): రైతులు తప్పనిసరిగా ఈ పంటను నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి ప్రసాద్‌రావు తెలిపారు. మండలంలోని కాటూరులో ఆదివారం ఈ పంట, ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం కల్లివెట్టులో పర్యటించి ధాన్యం, మార్కెట్ ధరలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టిందని రైతులు తప్పకుండా ఈకేవైసీ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో భారతి పాల్గొన్నారు.



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యేలు సుధీర్ రెడ్డి, కోనేటి ఆదిమూలం, గాలి భానుప్రకాష్, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్

సీఎం చంద్రబాబుకు ఘనస్వాగతం

రేణిగుంట, జనవరి 12(ఆంధ్రజ్యోతి) : తిరుపతి జిల్లా పర్యటనకు విచ్చేసిన సీఎం చంద్రబాబుకు ఆదివారం ఘనస్వాగతం లభించింది. విజయవాడ నుంచి తిరుపతి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, అధికారులు స్వాగతం పలికారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, తిరుపతి, నగరి, గంగాధర నెల్లూరు ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, ఆరణి శ్రీనివాసులు, గాలి భానుప్రకాష్, టీటీడీ ఛైర్మన్ బీఆర్‌నాయుడు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సదా శివం, సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సీఆర్‌రాజన్, టీడీపీ నాయ కులు శ్రీధర్‌వర్మ, మునస్వామి నాయుడు, బాల సుబ్రమణ్యం, హరిప్రసాద్, శ్రీకాళహస్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కోట వినుత, రాజారెడ్డి, కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఐజీ శియోషి, తిరుపతి జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ చందోలు తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. చంద్రబాబుతోపాటు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ కూడా వచ్చారు. అనంతరం రోడ్డు మార్గాన తిరుపతికి బయలుదేరి వెళ్లారు.

మంత్రి లోకేశ్‌కు...

తిరుపతి విమానాశ్రయంలో రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్‌కు ఆదివారం ఘన స్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి ఇండిగో విమానంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఇక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంగా తిరుపతి, శ్రీకాళహస్తి, చంద్రగిరి, నగరి ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, పులివర్తి నాని, గాలి భానుప్రకాష్, తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత, టీడీపీ నాయకులు శ్రీధర్ వర్మ తదితరులు మంత్రికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం సతీమణి బ్రాహ్మణి, కుమారుడు దేవాన్ష్‌తో కలిసి రోడ్డు మార్గాన నారావారిపల్లికి వెళ్లారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు



శ్రీకాళహస్తి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సరస్వతి శిశు మందిర్‌లో ఆదివారం ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితా రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమెకు ఉపాధ్యాయులు స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ ప్రజలు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం భోగి మంటలను వేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం వడ్డెర్ల గౌరవాన్ని పెంచారు

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి



సమావేశంలో మాట్లాడుతున్న దేవళ్ల మురళి

రేణిగుంట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్ వడ్డెరలో విభజన తీసుకొస్తే ఇప్పుడు సీఎం చంద్రబాబు గౌరవాన్ని తీసుకొచ్చారని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవళ్ల మురళి అన్నారు. స్థానికంగా ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడ్డెర్ల ఐకమత్యాన్ని జగన్ దెబ్బతీశారని దుయ్యబట్టారు. స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ప్రధాన అనుచరుడు వడ్డే ఓబన్న చేసిన సేవలను గుర్తించి ఆయన జయంతిని అధికారికం చేశారని తెలిపారు. వడ్డెరలు ఇప్పటికైనా వాస్తవాలు గ్రహించి కూటమి ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు మధుబాబు, కార్యదర్శి దేవళ్ల రమణ, ఉపాధ్యక్షుడు నాగరాజు, రాయలసీమ ప్రధాన కార్యదర్శి దేవళ్ల సాంబశివయ్య, సభ్యులు మునిరాజా, మునితర్నం, బాల తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న యువతరం సేవా సమితి సభ్యులు

శ్రీకాళహస్తి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని యువతరం సేవా సమితి నిర్వాహకులు అన్నారు. జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీకాళహస్తి పురపాలక సంఘం, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో పట్టణ నిరాశ్రయుల వసతిగృహంలో రక్తదాన శిబిరం జరిగింది. సుమారు 50మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో రక్తదానం చేయడం వలన మరొకరి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో యువతరం సేవాసమితి సభ్యులు, ఎన్టీఆర్ ట్రస్టు వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మనోన్మణి పురఉత్సవం



శ్రీకాళహస్తి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం మనోన్మణి (గొబ్బెమ్మ) ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయ అలంకార మండపంలో అమ్మవారికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య అమ్మవారిని చప్పరంపై అధిష్ఠింపజేసి పట్టణంలో ఊరేగించారు.

నేడు కవి సమ్మేళనం

శ్రీకాళహస్తి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సాహితి కళా వేదిక ఆధ్వర్యంలో సోమవారం కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి యువశ్రీ మురళి తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కవిసమ్మేళనం జరుగుతుందన్నారు. కవులు, రచయితలు, సాహితీప్రియులు, తెలుగు భాషాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా వివేకానందుడి జయంతి



వివేకానందుడికి నివాళులర్పిస్తున్న ఆపస్ నాయకులు - శ్రీకాళహస్తి పురుషుల డిగ్రీ కళాశాల, బీఎన్‌కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో నివాళులు

శ్రీకాళహస్తి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వివేకానందుడి జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా అధ్యక్షుడు టి.నాగరాజు మాట్లాడుతూ నేటి యువతకు వివేకానందుడి బోధనలు అవసరమన్నారు. ప్రకాష్, అంజనీప్రసాద్, సుబ్రహ్మణ్యంరెడ్డి, వీరాస్వామి, సుబ్రహ్మణ్యం, మంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో ఉన్న స్వామి వివేకానందుడి విగ్రహానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళుల ర్పించారు. జిల్లా యూత్ ఛైర్మన్ అజారుద్దీన్, స్కౌట్ మాస్టర్ ధనుష్, లీడర్లు శ్రీనివాసులు, తనూజ్, నిఖిల్, మునిరాం, స్కౌట్లు తదితరులు పాల్గొన్నారు.

● స్వామి వివేకానందుడి బోధనలను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో ఆదివారం స్వామి వివేకానందుడి జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశాభివృద్ధికి యువత ఎంతో అవసరమన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, రామకృష్ణ యాదవ్, తెలుగు యువత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పి జాగృతం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణయ్య కొనియాడారు. పాఠశాల ప్రాంగణంలో ఉన్న వివేకానంద విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.



శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన నివాళి కార్యక్రమం

స్కిట్ కళాశాలను పునఃప్రారంభించండి



లోకేశ్‌కు వినతిపత్రం ఇస్తున్న సుధీర్

శ్రీకాళహస్తి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్కిట్ కళాశాలను జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో పునః ప్రారంభించేందుకు చొరవ చూపాలని విద్యా శాఖ మంత్రి లోకేశ్‌కు ఎమ్మెల్యే సుధీర్ వినతి చేశారు. నారావారిపల్లికు వచ్చిన లోకేశ్‌ను విమానాశ్రయంలో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఏకైక కళాశాల స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల అన్నారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కళాశాలను ప్రైవేటుపరం చేయాలని చూసిందన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు నారా లోకేష్ సానుకూలంగా స్పందించి అన్ని విధాల కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

పోలీసు విధులకు ఆటంకం...
యువకులపై కేసు నమోదు

వరదయ్యపాళెం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బేకరిలో దౌర్జన్యం చేయడమే కాకుండా విచారణకు వెళ్లిన పోలీసులపై అనుచితంగా ప్రవర్తిస్తూ విధులకు ఆటంకం కలిగించిన యువకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. స్థానిక ఎస్టీకాలనీకి చెందిన మల్లికార్జున్, అశోక్ శనివారం రాత్రి పట్టణంలోని జీవీఆర్ బేకరికి వెళ్లి సిబ్బందితో గొడవ పడ్డారు. బేకరీ యజమాని దిలీప్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం శనివారం రాత్రి బేకరీకి వెళ్లి విచారిస్తున్న సమయంలో మల్లికార్జున్, అశోక్ అనుచితంగా వ్యవహరిస్తూ విధులకు ఆటంకం కలిగించారు. దీనిపై సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ అధికారి సాయిబాబా తెలిపారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్న ఈవో బాపిరెడ్డి

శ్రీకాళహస్తి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డి ఆదేశించారు. ఆదివారం ఆలయ పరిపాలన భవనంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 13న సోమవారం జరిగే ఆరుద్ర నక్షత్రంలో స్వామివారికి పూజలు, 15న గిరిప్రదిక్షణ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు పనులు ప్రారంభం



పిచ్చాటూరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామ అభివృద్ధిలో భాగంగా పిచ్చాటూరు పట్టణంలోని తేపువీధిలో సుమారు రూ.7.5 లక్షలతో రోడ్డు నిర్మాణాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించారు. రాజేంద్రరెడ్డి, సురేష్‌బాబు నాయుడు, రవిరెడ్డి, రఘునాయుడు, జయచంద్రారెడ్డి, సురేష్ నాయుడు, పురుషోత్తంరెడ్డి, పీఆర్ శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.